



డీఎంహెచ్‌వోకు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

సర్వే పారితోషికం విడుదల చేయాలి

వికారాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మూడేళ్లుగా ఆశ కార్యకర్తలకు రావాల్సిన లెప్రసీ సర్వే పారితోషికం వెంటనే విడుదల చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు భూమోళ్ల కృష్ణయ్య డీఎంహెచ్‌వోను విజ్ఞప్తి చేశారు. సర్వే పారితోషికంతో పాటు వారి సమస్యల పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన డీఎంహెచ్‌వో వెంకటరమణ, జిల్లా లెప్రసీ అధికారి రవీందర్‌ను కలిసి విన్నవించారు. ఆశ కార్యకర్తలకు రావాల్సిన సర్వే పారితోషికంలో సగం త్వరలో వేస్తామని, మిగతా సగం తర్వాత చెల్లిస్తామని అధికారులు హామీ ఇచ్చారని కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో ఆశ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు మంజుల, ప్రధాన కార్యదర్శి కవిత, యూనియన్ నాయకురాళ్లు అనిత, సునీత, జమున, అమృత ఉన్నారు.

రైల్వే వంతెన నిర్మాణం త్వరగా పూర్తి చేయాలి

ఘట్‌కేసర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌లోని రైల్వే వంతెనను త్వరగా పూర్తిచేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు రెండోరోజు సోమవారం కొనసాగాయి. దీక్షల్లో మున్సిపాలిటీ బీఆర్ఎస్ కౌన్సిలర్లు కూర్చున్నారు. రైల్వేవంతెన పనులు సంవత్సరాల తరబడి కొనసాగడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. ప్రభుత్వం స్పందించి ఘట్‌కేసర్‌లోని కొండాపూర్ రైల్వేగేట్ వద్ద నిర్మిస్తున్న వంతెన పనులను పూర్తి చేసి ప్రజల ఇబ్బందులను తీర్చాలని డిమాండ్ చేశారు.



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

3,797 మంది వీఆర్‌ఏలకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలి

» సీఐటీయూ రాష్ట్ర కన్వీనర్ వంగూరి రాములు

వికారాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఇంకా మిగిలి ఉన్న 3,797 మంది వీఆర్‌ఏలకు జీవో 81, 85 ప్రకారం వెంటనే నియామక ఉత్తర్వులు ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర కన్వీనర్ వంగూరి రాములు డిమాండ్ చేశారు. ఈ మేరకు వీఆర్‌ఏలతో కలిసి సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వీఆర్‌ఏలకు మద్దతుగా రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 11 నెలలైనా మిగిలి ఉన్న వీఆర్‌ఏలకు ఉత్తర్వులు జారీ చేయడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి ఈ మిగిలిన వీఆర్‌ఏలకు నియామక ఉత్తర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు మహిపాల్, వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షులు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

మేడ్చల్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7, 8వ తేదీల్లో నిర్వహిస్తున్న సీపీఎం జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శి ఎంపీ సురేశ్ కోరారు. సోమవారం ఆయన జిల్లా మహాసభల వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాసభలను విజయవంతం చేయటానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, అత్యధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

అయ్యో.. దేవుడా!

ఉమ్మడి జిల్లాలో మృత్యుఘోష

చేవెళ్ల, వికారాబాద్‌లో రోడ్డు ప్రమాదాలు
రెండు చోట్ల ఆరుగురు దుర్మరణం
విషాదంలో ఆలూరు, నాన్‌చెరు గ్రామాలు
ఇబ్రహీంపట్నంలో పరువు హత్య
అక్కని నరికి చంపిన తమ్ముడు
మేడ్చల్ జిల్లా నారాయణ కళాశాలలో
ఇంటర్ ఫస్టియర్ విద్యార్థి ఆత్మహత్య

ఉమ్మడి జిల్లాలో సోమవారం రోడ్లు రక్తమోడాయి. వేర్వేరు ఘటనల్లో ఆరుగురు మృతి చెందారు. చేవెళ్లలో రోడ్డు పక్కన కూరగాయలు విక్రయిస్తున్న రైతులపైకి వేగంగా వచ్చిన లారీ దూసుకెళ్లింది. ఈ దుర్ఘటనలో నలుగురు ప్రాణాలు వదిలారు. వికారాబాద్ పట్టణంలో బైక్, బొలేరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో బొలేరో వాహనం ముందు ఉన్న బైక్‌పై తిరగబడింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఇబ్రహీంపట్నంలో కులాంతర వివాహం చేసుకుందని అక్కపై కోపం పెంచుకున్న తమ్ముడు వేట కొడవలితో నరికి చంపాడు. అలాగే మేడ్చల్ జిల్లా అన్నోజిగూడలోని నారాయణ కళాశాలలో మూత్రానికి, నీరు తాగేందుకు బయటకు పంపించకుండా వేధింపులకు గురిచేశారు. దీన్ని భరించలేని ఇంటర్ విద్యార్థి బెడ్‌షీట్‌తో ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు.



చేవెళ్లలో రైతులపైకి దూసుకెళ్లిన లారీ, రోదిస్తున్న మృతుడు కృష్ణ తల్లి

రంగారెడ్డి అర్బన్/ చేవెళ్ల/ ఇబ్రహీంపట్నం/ వికారాబాద్/ఘట్‌కేసర్ రూరల్ , డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కష్టించి పండించిన పంటను అమ్ముకునేందుకు వస్తే.. లారీ రూపంలో ముగ్గురు రైతులతో పాటు కూరగాయలు కొనుక్కునేందుకు వచ్చిన ఒకరిని మాయదారి లారీ.. మృత్యువు రూపంలో ప్రాణాలను కబళించింది. చేవెళ్ల మండలం ఆలూరు గేట్ వద్ద సోమవారం సాయంత్రం జరిగిన ఈ ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర సంచలనం రేపింది. రోడ్డు ప్రమాదంలో ముగ్గురు రైతులు అక్కడికక్కడే

మిగతా 8వ పేజీలో...

నడుద్దాం.. రోగాలను జయిద్దాం

మారుతున్న జీవనశైలితో వాకింగ్‌కు ప్రాధాన్యం

9

ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్ల సందడి
ప్రజల్లో ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ



పాఠశాలల పక్కనే మురుగు

దుర్గంధంతో ఉపాధ్యాయులు, విద్యార్థులు సతమతం

10

ఈగలు, దోమలు, పందులతో పరేషాన్
పట్టించుకోని పాలకులు, అధికారులు



మధ్యాహ్న భోజన పరిశీలనకు కమిటీ

వసతి గృహాల్లో ఆహారం కలుషితం కాకుండా చర్యలు
రాపిడ్ రెస్పాన్స్ టీమ్(ఆర్ఆర్‌టీ) ఏర్పాటు
మండలానికి ఒక ప్రత్యేక అధికారి

9



పనుల జాతర!

ఉపాధి హామీ నిధులతో అభివృద్ధి

గ్రామ సభల్లో పనుల గుర్తింపు
నియోజకవర్గాల్లో ప్రారంభించనున్న ఎమ్మెల్యేలు
మార్చి వరకు కొనసాగనున్న పనులు
రూ.29 కోట్ల నిధులతో పనుల నిర్వహణ



వికారాబాద్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నారు. పనుల జాతర పేరిట ఉపాధిహామీ పథకం, గ్రామీణ రహదారుల నిర్మాణాలు, వివిధ సంక్షేమ పథకాలకు సంబంధించిన భవన నిర్మాణాల పనులు చేపట్టనున్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు ఉపయోగపడే పనులను చేపట్టడానికి ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలు రూపొందించింది. ఉపాధి హామీ ద్వారా గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు మార్చి నెలాఖరు వరకు కూలీలకు జీవనోపాధి కల్పించేలా పనులు చేపట్టనున్నారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఈ పనులు ఎమ్మెల్యేల చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. వచ్చే ఏడాది మార్చి నెలలోపు ఈ పనులు పూర్తి చేయాల్సి ఉంటుంది. నాలుగున్నర నెలల్లో జిల్లాలో 13 లక్షల రోజుల

మిగతా 10వ పేజీలో...

చేపట్టే పనులివే..

ఉపాధి హామీ పథకం పనుల్లో చేపట్టాల్సిన పనులపై గ్రామ సభలు నిర్వహించారు. ఈ సభల్లో రైతులు, కూలీలు, ప్రజలు చర్చించి చేపట్టాల్సిన పనులను ఎంపిక చేశారు. మహిళా శక్తి, ఉపాధి భరోసా కింద కోళ్ల ఫారాలు, పశువుల షెడ్లు, వర్మి కంపోస్ట్ తయారీ పనులు చేపట్టనున్నారు. పొలాలకు రోడ్ల సౌకర్యం కల్పించనున్నారు. వన మహోత్సవం కింద నర్సరీల ఏర్పాటుతో పాటు బిందు సేద్యం పనులు చేపట్టనున్నారు. జల నిధి కింద భూగర్భ జలాల పెంపునకు ఉపయోగపడే చెక్‌డ్యాంలు, ఇంకుడు గుంతలు, వ్యవసాయ బావుల నిర్మాణాలు చేపడతారు. వర్షం నీటిని ఒడిసి పట్టే ఇతర పనులూ కల్పించనున్నారు. గ్రామీణ మౌలిక వసతుల కల్పన కింద పంచాయతీ భవనాలు, పాఠశాలల్లో మరుగుదొడ్లు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలు చేపట్టనున్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

ఫిర్యాదులను పెండింగ్‌లో ఉంచొద్దు

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి) : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదులపై చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్‌లో అప్లోడ్ చేయాలన్నారు. దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో 72 ఫిర్యాదులు అందినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి పాల్గొన్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

అన్ని శాఖల అధికారులు విధిగా హాజరవ్వాలి: కలెక్టర్ ప్రతీక్ జైన్



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు తప్పని సరిగా హాజరై, ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో 128 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలకు జిల్లా అధికారులు ప్రాధాన్యత క్రమంలో ఎప్పటికప్పుడు లక్ష్యాలను పూర్తి చేసేందుకు కృషి చేయాలన్నారు. అనుమతి లేకుండా గురుకుల స్కూల్స్, కాలేజీలలో ప్రవేశించడం సొసైటీ రూల్స్‌కు విరుద్ధమన్నారు. అందువలన ఎవరికీ అనుమతి ఇవ్వరాదన్నారు. సమగ్ర కుటుంబ సర్వే డేటా ఎంట్రీని వేగవంతం చేయాలన్నారు. మధ్యాహ్న భోజనానికి సంబంధించి అంగన్‌వాడీలు, పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో

మిగతా 10వ పేజీలో...



పప్పును పరిశీలిస్తున్న శోభారాణి

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

కీసర రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందజేయాలని తెలంగాణ రాష్ట్ర మహిళా అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ బండ్రు శోభారాణి అన్నారు. నాగారంలోని మైనారిటీ బాలికల గురుకుల పాఠశాలను సోమవారం ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా హాస్టల్ భవనంలోని కిచెన్, స్టోర్, డార్మెటరీని పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులతో పాటు విద్యనందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు వెంకట్‌రెడ్డి, హరిబాబు, శ్రీనివాస్ రెడ్డి, స్వప్న పాల్గొన్నారు.

ఉంచుతారా? తొలగిస్తారా?

విలీన పంచాయతీల్లో వీడని సందిగ్ధత

ఉద్యోగులు, కార్మికుల్లో ఆందోళన.. ప్రశ్నార్థకంగా 350 మంది జీవితాలు!



మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని మున్సిపాలిటీల్లో విలీన గ్రామాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులను ఉంచుతారా? తొలగిస్తారా? అనే సందిగ్ధత వీడటం లేదు. జిల్లాలో 28 గ్రామాలు సమీప మున్సిపాలిటీల్లో విలీనమయ్యాయి. తమ ఉద్యోగాల భవిష్యత్ ఏమిటో తెలియక ఉద్యోగులు, కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. విలీనమైన పంచాయతీల్లో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ప్రస్తుతం యథావిధిగా ఆయా బల్దియాల్లో విధులు నిర్వహిస్తున్నారు. కాకీ వారికి ఇప్పటి వరకు మున్సిపాలిటీ ఉద్యోగులుగా, కార్మికులుగా గుర్తించడం లేదు.

500 మంది జనాభాకు ఒకరు చొప్పున

బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో ప్రవేశపెట్టిన జీఓ 51 అమలుపై పంచాయతీరాజ్ శాఖ కసరత్తు చేస్తున్న నేపథ్యంలో తమ ఉద్యోగాల భవిష్యత్ ఏమిటోనన్న ఆందోళనను వారు వ్యక్తం చేస్తున్నారు. మున్సిపాల్టీల్లో విలీనమైన తర్వాత తమ వేతనాలు పెరుగుతాయని భావించిన సంబంధిత ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జీఓ 51 నిబంధనల ప్రకారం పంచాయతీల్లో 500 మంది జనాభాకు ఒక ఉద్యోగి చొప్పున మల్టీపర్పస్ వర్కర్‌ను నియమించుకోవాల్సి ఉంది. ఈ జీఓ ప్రకారం పంచాయతీరాజ్ శాఖ పంచాయతీల్లో ఉన్న అదనపు సిబ్బందిని తొలగించే పనిలో నిమగ్నమైంది. దీంతో మున్సిపాల్టీల్లో విలీనమైన ఉద్యోగులు, కార్మికుల భవిష్యత్తు ప్రమాదంలో పడింది. విలీన గ్రామాల్లో అదనంగా పనిచేస్తున్న 350 మంది ఉద్యోగుల తొలగింపుపై సందిగ్ధత నెలకొంది. మున్సిపాల్టీల్లో విలీనమైన పంచాయతీ ఉద్యోగులను, కార్మికులను బల్దియా సిబ్బందిగా గుర్తించకపోగా, పంచాయతీరాజ్ శాఖ అదనపు సిబ్బందిని గుర్తించే నివేదిక రూపొందిస్తుండటంతో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనని వారు ఆందోళన చెందుతున్నారు.

2 నెలలుగా అందని వేతనాలు

రెండు నెలలుగా విలీనమైన గ్రామాల సిబ్బందికి వేతనాలు కూడా చెల్లించడం లేదు. దీంతో వారు ఇబ్బందులకు గురవుతున్నారు. తమ వేతనాల కోసం ఇటు మున్సిపాలిటీలు, అటు పంచాయతీరాజ్ శాఖ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. ఇప్పటికే పంచాయతీరాజ్ శాఖ తయారు చేసిన జాబితాపై ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గతంలో గ్రామాల్లో పెరిగిన జనాభాకనుగుణంగా ఉద్యోగులు, కార్మికులను నియమించారని జీఓ నంబరు 51ను కూడా రద్దు చేశారని వారు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో దాదాపు 350 మంది ఉద్యోగులు, కార్మికులు తమ భవిష్యత్ ప్రశ్నార్థకంగా మారింది.

కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్



రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి

కొడంగల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని తాండూర్ సబ్‌కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని అప్పాయిపల్లి, పెద్దనందిగామ గ్రామాల్లో ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. సోమవారం ఆయా గ్రామాల్లో పర్యటించిన ఆయన కొనుగోలు కేంద్రాల్లో వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియను పరిశీలించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ బీ.విజయ్‌కుమార్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

కొడంగల్ రూరల్: మండలంలోని అప్పాయిపల్లి, పెద్దనందిగామ గ్రామాల్లో సోమవారం ఐకేపీ, పీఏసీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను తాండూర్ సబ్‌కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో తేమ శాతం కొలిచే యంత్రాలను, తూనికల యంత్రాలను పరిశీలించారు. ఆయన వెంబడి తహసీల్దార్ విజయ్‌కుమార్, ఐకేపీ, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చేస్తే సమాచారమివ్వండి



మేడిపల్లిలో ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

యాచారం, నవంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బాల్య వివాహాలు చేస్తే అంతకు ముందే తమకు సమాచారం ఇవ్వాలని, చైల్డ్ మ్యారేజెస్ నిర్మూలను ప్రజలు సహకరించాలని హైదరాబాద్ గ్రీన్ ఫార్మాసిటీ పోలీసులు ప్రజలను కోరారు. సోమవారం రాత్రి యాచారంలో సీఐ ఎ.నర్సింహారావు, ఎస్సైలు మధు, సత్యనారాయణ తమ సిబ్బందితో ప్రజలను కలిసి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. యువత గంజాయి, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్‌చేసి ఓటీపీ అడిగితే కాల్ కట్ చేయాలన్నారు. దుకాణాదారులు షాపులకు సీసీ కెమెరాలు బిగించుకోవాలన్నారు. మేడిపల్లిలో గ్రీన్ ఫార్మాసిటీ సీఐ కృష్ణంరాజు, ఎస్సై తేజంరెడ్డి పర్యటించారు. కొత్తవారు, అనుమానాస్పద వ్యక్తులు కన్పిస్తే పోలీసులకు సమాచారమివ్వాలన్నారు. కల్తీ, ఈగలు, దోమలు వాలిన ఆహారం తింటే రోగాలు కొనితెచ్చుకున్నట్లేనని ప్రజలకు సూచించారు. మద్యం తాగి వాహనాలు నడపొద్దన్నారు.

32వ రోజుకు మండల సాధన దీక్షలు

తలకొండపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ చేపట్టిన రిలే నిరాహార దీక్షలు సోమవారానికి 32వ రోజుకు చేరాయి. దీక్షలో జేఏసీ నాయకులు, యువకులు, గ్రామస్తులు కూర్చున్నారు. 9 పంచాయతీలను కలిపి గట్టిప్పలపల్లిని మండలం చేయాలని జేఏసీ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ శరత్‌చంద్రలు ప్రభుత్వాన్ని కోరారు. మండల కేంద్రం ఏర్పాటు చేసేలా ఎమ్మెల్యే నారాయణరెడ్డి చొరవ తీసుకోకుంటే ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు వెంకటయ్య, మోహన్, అంజన్‌రెడ్డి, మల్లయ్య, శేఖర్, అల్లావుద్దీన్, కృష్ణయ్య, నిరంజన్, కొండల్, అంజనేయులు, విజయ్, లక్యానాయక్ పాల్గొన్నారు.

అయ్యో.. దేవుడా!

(7వ పేజీ తరువాయి)

దుర్మరణం చెందారు. మరో వ్యక్తిని చేవెళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషమ స్థితిలో ఉన్న అతడికి సీపీఆర్ నిర్వహించి బతికించే ప్రయత్నం చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. చివరకు అతన్ని కూడా మృత్యువు కాటేసింది. ఈ ప్రమాదంలో మరో నలుగురు గాయపడ్డారు. ఇందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని స్థానికులు తెలిపారు. ప్రమాదానికి ప్రధాన కారణం లారీ డ్రైవర్ అతివేగం, అజాగ్రత్త, ఓవర్ టేక్ చేయడంతో ప్రమాదం జరిగిందని ఘటన స్థలంలో చూసిన వ్యక్తులు చెబుతున్నారు. లారీ డ్రైవర్ కేబిన్‌లో ఇరుక్కుపోవడంతో జేసీబీ సహాయంతో కేబిన్‌ను తొలగించి ప్రాణాలతో బయటకు తీశారు. డ్రైవర్ రెండు కాళ్లు నుజ్జునుజ్జయ్యాయి. ఆలూరు గ్రామంతో పాటు నాన్‌చెరులో విషాద ఛాయలు అలముకున్నాయి. కాగా, ఆలూరు గ్రామానికి మొగులయ్య, ఆకుల పద్మమ్మ, నాన్‌చెరు గ్రామానికి చెందిన బాలమణి, మాలయాద్రి గాయపడ్డారు.



ఆలూరు వద్ద బాధితుల ఆందోళన

మృతుల కుటుంబాలను ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డితో పాటు చేవెళ్ల ఎమ్మెల్యే యాదయ్య, మాజీ ఎమ్మెల్యే రత్నం, చేవెళ్ల ఇన్‌చార్జి భీంభారత్, కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు కార్తీక్‌రెడ్డి, దేశమొళ్ల అంజనేయులు, ఆర్డీవో చంద్రకళ, డీసీపీ శ్రీనివాస్, ఏసీపీ కిషన్, తహసీల్దారు కృష్ణ, సీఎం భూపాల్ శ్రీధర్, తదితరులు పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు.

కూరగాయలు పోసి వెళ్లే సమయంలో..

మృతుడు ఆలూరు గ్రామానికి చెందిన దామరగిద్ద కృష్ణ (22) డిగ్రీ పూర్తి చేశాడు. ఇటీవల కేంద్ర ప్రభుత్వ ఉద్యోగానికి పరీక్ష కూడా రాశాడు. ఉద్యోగ వేటలో ఉన్న ఆ యువకుడు తల్లిదండ్రులు జంగయ్య, యాదమ్మకు వ్యవసాయంలో చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఆలూరు గేటు వద్ద కూరగాయాలు వేసి తిరుగు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. అంతలోనే లారీ ఆ యువకుడిని మృత్యురూపంలో కబళించింది.

అక్కను నరికి హతమార్చిన తమ్ముడు

ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధి రాయపోల్‌లో మరో దారుణం చోటుచేసుకుంది. కులాంతర వివాహం చేసుకుందని అక్కను తమ్ముడు వేట కొడవలితో నరికి హతమార్చాడు. హయత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగమణికి ఎనిమిదేళ్ల క్రితం ఇబ్రహీంపట్నం మండలం ఎంపీ పటేల్‌గూడకు చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. ఇటీవల అతనితో విడాకులు తీసుకుంది. అయితే నాగమణి, రాయపోల్ గ్రామానికి చెందిన శ్రీకాంత్ పెళ్లికాకముందు నుంచే ప్రేమించుకుంటున్నారు. నాగమణి విడాకులు అయిన తర్వాత గత నెల 10న వారు ప్రేమ వివాహం చేసుకున్నారు. వీరిది కులాంతర వివాహం కావడంతో నాగమణి సోదరుడు పరమేష్ తట్టుకోలేకపోయాడు. నాగమణి, శ్రీకాంత్ ఆదివారం రాయపోల్‌కు వచ్చారు. సోమవారం ఉదయం స్కూటీపై డ్యూటీకి వెళ్తున్న నాగమణిని కారుతో ఢీకొట్టాడు. కిందపడగానే వెంట తెచ్చుకున్న వేట కొడవలితో మెడపై నరికి చంపాడు. అయితే ఇది పరువు హత్య కాదు.. ఆస్తి తగాదా కారణమని స్థానికులు చెబుతున్నారు.

కారు, బొలేరో ఢీ.. బైక్‌పై ఉన్న ఇద్దరు మృతి



వికారాబాద్ రోడ్డు ప్రమాదంలో బొలేరో వాహనం బోల్తా పడటంతో కిందపడిన మద్యం బాక్సులు

వికారాబాద్ పట్టణం రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన రవీందర్(45) మెడికల్ కళాశాలలో కాంట్రాక్టర్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన హేమంత్(25) అనంతగిరిలోని ఆయూష్ ఆసుపత్రి నిర్మాణం భవనంలో ఎలక్ట్రీషన్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి రేషన్ సరుకుల కోసం వికారాబాద్‌కు ఇద్దరు బైక్‌పై వెళ్తున్నారు. ఆ సమయంలో మద్యం లోడుతో వెళుతున్న బొలేరో వాహనం, కారు ఢీకొన్నాయి. ఆ ప్రమాదంలో బైక్‌పై బొలేరో వాహనం ఎగిరిపడింది. దీంతో బైక్‌పై ఉన్న రవీందర్, హేమంత్ ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఇద్దరూ మృతి చెందారు. రవీందర్‌కు భార్య ఇద్దరు పిల్లలు ఉండగా హేమంత్ భార్య ఉంది. బొలేరోలో ఉన్న మద్యం బాక్సులు పూర్తిగా కిందపడిపోయాయి. ఒక వైపు ప్రమాదంలో ప్రాణాలు పోతుంటే జనం మాత్రం మద్యం ఎత్తుకెళ్లేందుకు ఉత్సాహం చూపించారు. కొందరూ స్థానికులు వచ్చి మద్యం సీసాలను మరో వాహనంలో ఎక్కించడం కనిపించింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ భీమ్ కుమార్ తెలిపారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య



ఆందోళనకు దిగిన మృతుని తల్లిదండ్రులు, బంధువులు

యాదాద్రి జిల్లా, బీబీనగర్ మండలం, పెద్దపలుగు తండాకు చెందిన బానోత్ జగన్నాథం నగరంలోని కుషాయిగూడ చక్రీపురంలో ఉంటున్నాడు. ఆయన చిన్న కుమారుడు బానోత్ తనుష్ నాయక్(16) అలియాస్ టింకు అన్నోజిగూడలోని నారాయణ జూనియర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం సాయంత్రం నాలుగున్నర గంటలకు విద్యార్థులను టీ బ్రేక్‌కు వదలడంతో టీ తాగి తిరిగి తరగతి గదులకు వెళ్తుండగా తనుష్ కనిపించ లేదు. దీంతో తోటి విద్యార్థులు వెతకడంతో బాత్‌రూంలో బెడ్‌షీట్‌తో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని గుర్తించారు. వెంటనే అధ్యాపకులకు తెలిపారు. దీంతో కళాశాల యాజమాన్యం హుటాహుటిన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే తనుష్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లిదండ్రులు రాకముందే మృతదేహాన్ని ఆస్పత్రికి ఎలా తరలిస్తారని మృతుడి బంధువులు ఆందోళనకు దిగారు. కళాశాల గేట్లు తన్నుకొని లోపలికి వెళ్లి ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. దీంతో గేటు ఎదుట బైఠాయించి కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మృతుడి బంధువు ఒకరు ఒంటిపై కిరోసిన్ పోసుకోని ఆత్మహత్యకు యత్నించాడు. అక్కడకు విద్యార్థి సంఘాలు చేరుకొని కళాశాల వేధింపులు ఎక్కువగా ఉన్నాయని, వేధింపుల కారణంగానే తనుష్ ఆత్మహత్య చేసుకున్నారని ఆరోపించారు. న్యాయం జరిగే వరకు ఇక్కడి నుంచి వెళ్లేదే లేదని బైఠాయించారు.



మృతదేహాలను పరిశీలిస్తున్న ప్రభుత్వ విప్ మహేందర్‌రెడ్డి



మృతదేహాలను పరిశీలిస్తున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

రేపు హిందూ ఐక్యవేదిక ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

వికారాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల రేపు(బుధవారం) హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు చిగుళ్లపల్లి రమేష్, సురేష్‌శర్మ, రాజు, ముత్తారెడ్డిలు అన్నారు. వికారాబాద్ పట్టణంలోని రామ మందిరంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని న్యూ గంజ్ హనుమాన్ ఆలయం నుంచి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలో హిందువులు, ఉద్యోగ సంఘాలు, అన్ని వర్గాల హిందువులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు చౌదరి యాదవరెడ్డి, బస్వలింగం, భక్తవత్సలం, విజయ్‌కుమార్, సదానందారెడ్డి, విద్యాసాగర్, నవీన్, యాదగిరి, శివరాజ్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

రూ.30లక్షలతో పార్కుల సుందరీకరణకు చర్యలు



మాట్లాడుతున్న చైర్మన్ అశోక్

పరిగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పరిగి పట్టణంలోని పార్కుల సుందరీకరణకు 15వ ఆర్థిక సంఘం నిధుల కింద రూ.30లక్షలు ఖర్చు చేస్తామని పరిగి మునిసిపల్ చైర్మన్ ఎం.అశోక్ అన్నారు. మునిసిపల్ పాలకవర్గ సమావేశం సోమవారం నిర్వహించి మాట్లాడారు. రూ.75లక్షల సాధారణ నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. డ్రైనేజీ, సీసీరోడ్ల నిర్మాణానికి రూ.3లక్షల చొప్పున, శాశ్వత తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.16కోట్లతో ఇటివలే శంకుస్థాపన చేశామన్నారు. త్వరలోనే పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. పరిగి అభివృద్ధికి మరో రూ.25కోట్ల నిధులు మంజూరైనట్లు తెలిపారు. రూ.5కోట్లతో కార్యాలయ భవనం, రూ.20కోట్లతో వివిధ కాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు చేపడుతున్నట్లు చెప్పారు. పరిగిని జిల్లాలోనే ఆదర్శ పట్టణంగా మారుస్తామని తెలిపారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ ప్రసన్నలక్ష్మి, కమిషనర్ వెంకటయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

కళాశాల భవనానికి లక్ష విరాళం

షాద్‌నగర్ అర్బన్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి స్థానిక బీఏఎం డిగ్రీ కళాశాల అధ్యాపకుడు నాగరాజు లక్ష విరాళం ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శంకర్‌కు చెక్కును ఇచ్చారు. పూర్తి సౌకర్యాలతో నిర్మిస్తున్న భవన నిర్మాణానికి ఆర్థిక సహకారం అందించిన నాగరాజును ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, డైరెక్టర్ కరుణాకర్, కాంగ్రెస్ నాయకులు శివశంకర్‌గౌడ్, చెంది తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఆశావర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



కలెక్టరేట్‌లో వినతి పత్రం సమర్పిస్తున్న బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శంభు ప్రభాకర్

మేడ్చల్ టౌన్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు శంభు ప్రభాకర్ డిమాండ్ చేశారు. మేడ్చల్ కలెక్టరేట్‌లో ఆశావర్కర్లతో కలిసి బీఆర్‌టీయూ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శంభు ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆశావర్కర్లకు ప్రతీనెల చెల్లించాల్సిన బిల్లులను వెంటనే చెల్లించాలన్నారు. చాలీచాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్న ఆశావర్కర్ల సమస్యలను విస్మరిస్తే పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్టీయూ నాయకులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

రేపు హిందూ ఐక్యవేదిక ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న హిందూ ఐక్యవేదిక నాయకులు

వికారాబాద్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఈనెల రేపు(బుధవారం) హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూ ఐక్యవేదిక ప్రతినిధులు చిగుళ్లపల్లి రమేష్, సురేష్‌శర్మ, రాజు, ముత్తారెడ్డిలు అన్నారు. వికారాబాద్ పట్టణంలోని రామ మందిరంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జిల్లా కేంద్రంలోని న్యూ గంజ్ హనుమాన్ ఆలయం నుంచి పెద్దఎత్తున ర్యాలీ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే ర్యాలీలో హిందువులు, ఉద్యోగ సంఘాలు, అన్ని వర్గాల హిందువులు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో నాయకులు చౌదరి యాదవరెడ్డి, బస్వలింగం, భక్తవత్సలం, విజయ్‌కుమార్, సదానందారెడ్డి, విద్యాసాగర్, నవీన్, యాదగిరి, శివరాజ్, డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

కొత్త విషయాలు తెలుసుకొని బోధించాలి



మాట్లాడుతున్న డాక్టర్ సుప్రితి

మేడ్చల్ టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అధ్యాపకులు కొత్త విషయాలను తెలుసుకుని విద్యార్థులకు బోధించాలని జేఎన్టీయూ కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి డక్టర్ సుప్రితి అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లర్నింగ్‌పై నిర్వమించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఏఐతో రోజుకో కొత్త మార్పు చోటుచేసుకుంటున్నందున విద్యార్థులకు బోధించే అధ్యాపకులు సబ్జెక్టుపై పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఇలాంటి కార్యక్రమాలను అధ్యాపకులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, డైరెక్టర్ ఎ.మోహన్, ప్రిన్సిపాల్ లోకనాథం. వైస్ ప్రిన్సిపాల్ పురుషోత్తం, డీన్ డాక్టర్ రాము పాల్గొన్నారు.

హైవేపై పవర్ బ్లింకర్ ఏర్పాటు



పవర్ బ్లింకర్‌ను ప్రారంభిస్తున్న టోల్ మేనేజర్ ఇబ్రహీం, ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్

షాద్‌నగర్‌రూరల్, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా సోమవారం పవర్ బ్లింకర్‌ను ఏర్పాటు చేశారు. రాయికల్ టోల్ ప్లాజా సమీపంలో రామేశ్వరం ఆలయానికి వెళ్లే జంక్షన్ వద్ద టోల్ ప్లాజా మేనేజర్ ఇబ్రహీం, షాద్‌నగర్ ట్రాఫిక్ సీఐ చంద్రశేఖర్‌తో కలిసి బ్లింకర్‌ను సోమవారం ప్రారంభించారు. జంక్షన్ వద్ద ప్రమాదాలు జరుగుతాయని, వాటిని నివారణకు వాహనదారులను అప్రమత్తం చేసేలా బ్లింకర్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా సిబ్బంది భానుప్రకాశ్, విశ్వనాథ్‌రాజు, బిజోయ్‌బాబు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న రూరల్ సీఐ నర్సయ్య

చౌదరిగూడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సమాజంలో నిత్యం జరుగుతున్న సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని షాద్‌నగర్ రూరల్ సీఐ నరసయ్య అన్నారు. సోమవారం కొందుర్గు పోలీస్ స్టేషన్‌లో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో సీసీ కెమెరాలు, సైబర్ క్రైంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. యువత ఆన్‌లైన్ గేమ్‌లకు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల కూడళ్లలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే చోరీలను నివారించొచ్చని సూచించారు. ప్రతొక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎస్సై కృష్ణ, లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, నాయకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రేపు తుర్కపల్లిలో పీహెచ్‌సీ ప్రారంభం



సమావేశంలో మాట్లాడుతున్న వేణుగోపాల్‌రెడ్డి

శామీర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుర్కపల్లి గ్రామంలో నూతనంగా ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి(పీహెచ్‌సీ)ని ప్రారంభిస్తున్నట్లు మేడ్చల్ ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జీడిపల్లి వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి చొరవతో తుర్కపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక ఆస్పత్రి మంజూరైనట్లు తెలిపారు. తుర్కపల్లికి ఈనెల 4న బుధవారం ఉదయం 11గంటలకు రాష్ట్ర ఆరోగ్య, వైద్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహా ముఖ్యఅతిథిగా విచ్చేసి నూతనంగా ఏర్పాటు చేసిన ప్రాథమిక ఆస్పత్రిని ప్రారంభించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి తదితర నాయకులు విచ్చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ పార్టీల నాయకులు, అధికారులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వేణుగోపాల్‌రెడ్డి పిలుపునిచ్చారు.



జాగింగ్ చేస్తున్న వాకర్స్

నడుద్దాం..

రోగాలను జయిద్దాం

మారుతున్న జీవనశైలితో నడకకు ప్రాధాన్యం

- ఉదయం, సాయంత్రం వేళల్లో వాకర్ల సందడి
- ప్రజల్లో ఆరోగ్యంపై పెరిగిన శ్రద్ధ



కొడంగల్ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నేటి ఆధునిక కాలంలో టెక్నాలజీ పెరిగి మానవాళికి శారీరక శ్రమ తగ్గింది. దీంతో అనేకరకాల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. మానసిక ఆందోళన, ఒత్తిడి వంటివి జీవితాలను తలకిందులు చేస్తున్నాయి. మారుతున్న జీవనశైలి కారణంగా అనేక మంది ఊబకాయం, షుగర్, బీపీ తదితర దీర్ఘకాలిక సమస్యలతో బాధపడుతున్నారు. వీటన్నింటినీ ఎదుర్కొనేందుకు నడక చక్కటి ఆరోగ్య సూత్రమని వైద్యనిపుణులు చెబుతున్నారు. కేవలం మందులతోనే సరిపెట్టుకోకుండా క్రమం తప్పకుండా వాకింగ్ అలవాటు చేసుకుంటే మెరుగైన ఆరోగ్యం సొంతమవుతుందని సూచిస్తున్నారు. రెండేళ్లపాటు మరణమృదంగం వాయించిన కొవిడ్ మహమ్మారి సైతం ఆరోగ్యం పట్ల హెచ్చరికలు జారీచేసి వెళ్లింది. ఈ అనుభవంతో ప్రజల్లో కాస్త మార్పు వచ్చింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు వారి పరిమితిని బట్టి నడిచేస్తున్నారు. వయస్సుకు సరిపడా అడుగులు వేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకుంటున్నారు.

ఉదయం, సాయంత్రం నడక

ఉదయం నడక, సూర్యరశ్మితో ఎముకల్లో కాల్షియం లోపాలను అధిగమించవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. దీంతో పట్టణవాసులు సూర్యుడు ఉదయించక ముందే క్రీడాప్రాంగణాలు, ఖాళీమైదానాలు, గ్రామాల్లో ఊరి పొలిమేర వరకు చకచకా నడిచేస్తున్నారు. ఉదయం వేళ కుదరని వారు మాత్రం సాయంత్రం నుంచి రాత్రి వరకు వాకింగ్‌కు సమయాన్ని కేటాయిస్తున్నారు. కొడంగల్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానం, జిల్లాపరిషత్తు బాలుర ఉన్నత పాఠశాల మైదానం వాకర్స్‌కు వేదికగా మారింది. వాకింగ్ అనంతరం వ్యాయామాలు, యోగా చేస్తున్నారు. పాఠశాలల మైదానాలే కాక జాతీయ రహదారి వెంబడి వాకర్స్ సంఖ్య పెరుగుతోంది.

నడకతో ప్రయోజనాలివే

క్రమం తప్పకుండా నడవడం వల్ల శరీరంలో ఎండార్ఫిన్స్ అనే హార్మోన్లు విడుదలై మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఒత్తిడి, ఆందోళన, డిప్రెషన్, కంగారు అంశాలను అధిగమించవచ్చు. గుండె సంబంధిత జబ్బులు, పక్షవాతం వంటివి దరిచేరవు. గుండె, ఊపిరితిత్తులకు రక్తప్రసరణ సక్రమంగా జరిగి సమర్థవంతంగా పనిచేస్తాయి. అధిక రక్తపోటు, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి రోగాలను నియంత్రిస్తుంది. కీళ్లు, కండరాలు సాగుతూ శక్తి పెరిగి నడిచేందుకు పూర్తిస్థాయిలో సమతుల్యత తీసుకవస్తుంది. శరీరంలోని అధిక కొవ్వు శాతాన్ని తగ్గిస్తుంది. శరీరానికి మంచి శ్వాస, అధికస్థాయిలో ఆక్సిజన్ తీసుకునేలా చేస్తుంది. ఎముకలు ధృడంగా తయారవుతాయి. మానసికంగా, ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని ఇస్తుంది. రక్తంలోని కొవ్వు కరుగుతుంది. విటమిన్ డి లోపం ఉండదు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది.

నడక జీవిత కాలాన్ని పెంచుతుంది



30 సంవత్సరాలు దాటిన వారంతా నడకను దినచర్యగా పెట్టుకోవాలి. నడక వల్ల గుండె, ఊపిరితిత్తులకు రక్త ప్రసరణ సక్రమంగా జరుగుతుంది. దీంతో గుండె సంబంధింత జబ్బులు దరిచేరవు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుంది. ఎముకలు ధృడంగా మారుతాయి. **- కె.నర్సిరెడ్డి, వాకర్, కొడంగల్**

వాకింగ్‌తో ఉల్లాసం



వాకింగ్ చేస్తుంటే ఎంతో ఉల్లాసంగా ఉంటుంది. మానసిక ఒత్తిడి అధికమవుతున్న నేటి రోజుల్లో ప్రతీ ఒక్కరు వాకింగ్ చేయాలి. వాకింగ్‌తో బీపీ, షుగర్ వంటి వ్యాధులు రావు. వాకింగ్ చేయని రోజు ఎంతో బద్దకంగా ఉంటుంది. ఏ పనీ చేయాలనిపించదు. **- కె.నర్సింహులు, వాకర్, కొడంగల్**

నస్కల్‌లో నిధుల దుర్వినియోగంపై విచారణ



నస్కల్ పంచాయితీ కార్యాలయంలో విచారిస్తున్న డీఎల్‌పీవో సంధ్యారాణి

పరిగి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని నస్కల్ పంచాయితీలో నిధుల దుర్వినియోగంపై సోమవారం డీఎల్‌పీవో సంధ్యారాణి విచారణ జరిపారు. పంచాయితీ కార్యదర్శి పారూక్‌హుస్సేన్ నిధుల దుర్వినియోగంపై గ్రామస్తులు ఇటీవల కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు డీఎల్‌పీవో సోమవారం క్షేత్రస్థాయిలో నస్కల్ పంచాయితీ కార్యాలయానికి వచ్చి విచారణ జరిపారు. పంచాయితీలో నిధుల ఖర్చులకు సంబంధించి రికార్డులను సీజ్‌చేశారు. విచారణ నివేదిక డీపీవోకు అందజేస్తామని తెలిపారు.

కొడంగల్‌లో రెండు రోజుల రిలే నిరాహార దీక్షలు



సమావేశంలో మాట్లాడుతున్న వికలాంగ సంఘం నాయకులు

వికారాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొడంగల్ నియోజకవర్గంలో రెండు రోజులు (మంగళ, బుధ) రిలే నిరాహాదీక్షలు చేయనున్నట్లు భారత దివ్యాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు సుధీర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింహులు అన్నారు. పట్టణంలోని అతిథి గృహంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దివ్యాంగులకు 6వేల పింఛన్, బస్‌పాస్‌తో పాటు ప్రతీ బస్సులో ఐదు ప్రత్యేక రిజర్వేషన్ సీట్లు కల్పించాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల బంధు కింద రూ.10లక్షలు ఇవ్వాలని కోరారు.

దళితబంధు దేశానికే ఆదర్శం



దళితబంధు యూనిట్‌ను ప్రారంభిస్తున్న జైపాల్‌యాదవ్

కల్వాల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్‌యాదవ్ అన్నారు. కల్వాలలో మక్తమాదారానికి చెందిన శివ దళిత బంధు స్కీం రూ.10లక్షలతో చేపట్టిన యూనిట్‌ను సోమవారం మాజీ జడ్పీటీసీ దశరథ్‌నాయక్, డీసీసీబీ డైరెక్టర్ వెంకటేశ్‌లతో కలిసి జైపాల్ ప్రారంభించారు. యువత ఉద్యోగ, ఉపాధికి ప్రభుత్వాలు పెద్దపీట వేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం గ్యారంటీల అమల్లో విఫలమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి కేసీఆర్‌పై విమర్శలు మాని పాలనపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సాయిలు, హరిచంద్, శంకర్, గణేశ్, శ్రీనివాస్‌గౌడ్, సత్యనారాయణ, మహేందర్, చందు, చెన్నయ్య పాల్గొన్నారు.

సేవలను బట్టే కీర్తి

సేవలను బట్టే సమాజంలో గౌరవం లభిస్తుందని జైపాల్‌యాదవ్ అన్నారు. కల్వాల భగత్‌సింగ్ నాయీబ్రాహ్మణ సేవా సంఘానికి జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రూ.51వేలు సమకూర్చారు. సోమవారం జైపాల్‌తో కలిసి ట్రస్ట్ చైర్మన్ దశరథ్ నాయక్ సంఘం నాయకులకు చెక్కు అందజేశారు. చేయూతనిచ్చిన దశరథ్‌ను జైపాల్, సంఘం నాయకులు సత్కరించారు. చారిటబుల్ ట్రస్ట్‌తో దశరథ్ అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో గంప వెంకటేశ్, యువజన సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రోళ్ల రాఘవేందర్, కానుగుల లక్ష్మయ్య, సత్యం, శివ, మహేందర్, జంగయ్య, వెంకటేశ్, శ్రీను, మురళి, శంకరయ్య, మహేశ్, నర్సింహ, లాయక్ అలీ, మధు, జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేపు ఆమనగల్లు ఏఎంసీ ప్రమాణ స్వీకారం

హాజరుకానున్న మంత్రులు తుమ్మల, జూపల్లి, దామోదర్



ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ గీత, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి



గీత



భాస్కర్‌రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గం బుధవారం కొలువుదీరనుంది. కమిటీ ప్రమాణ స్వీకారోత్సవానికి మార్కెటింగ్‌శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 10గంటలకు ఆమనగల్లు వ్యవసాయ మార్కెట్ కార్యాలయంలో ప్రమాణస్వీకారం ఉంటుంది. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమానికి వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర్ రాజనర్సింహ, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, టీయూఎఫ్ఐడీసీ చైర్మన్ చల్లానర్సింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరవుతారని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ సోమవారం తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం లక్ష్మీ గార్డెన్‌లో సభ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమ ఏర్పాట్లను మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి చైర్‌పర్సన్ గీతనర్సింహ, వైస్‌చైర్మన్ భాస్కర్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జగన్, డైరెక్టర్ శ్రీశైలం, యూత్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణనాయక్ పరిశీలించారు.

ప్రజాసంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



రెవెన్యూ కార్యాలయానికి స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శంకర్

నందిగామ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా, ప్రజలకిచ్చిన మాటను నిలబెట్టుకుంటూ తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం నందిగామలో నూతనంగా తహసీల్దార్ కార్యాలయం నిర్మించేందుకు స్థలాన్ని ఆయన స్థానిక నాయకులతో కలసి పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మండల కేంద్రంలో కార్యాలయాలు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారన్నారు. గత ప్రభుత్వం 8ఏళ్లలో మండలంలో ఒక్క కార్యాలయాన్నైనా నిర్మించలేదన్నారు. నందిగామలో అన్ని వసతులతో ప్రభుత్వ కార్యాలయాలను నిర్మిస్తామన్నారు. త్వరలోనే రెవెన్యూ ఆఫీసు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేశ్వర్, మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు నర్సింలు, నాయకులు కృష్ణ, బాల్‌రెడ్డి, చంద్రపాల్‌రెడ్డి, డి.కుమార్‌గౌడ్, రాజగోపాల్, సి.నర్సింలు, కె.వెంకట్‌రెడ్డి, వై.శ్రీకాంత్‌గౌడ్, రవీందర్, సుమన్, బి.నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌దే



ఘట్‌కేసర్ రూరల్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ మొత్తం ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్(ఏఐ)దేనని అనురాగ్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ డీన్ విజయకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ మేధస్సుతో కలిగే లాభాలను విద్యార్థులకు వివరించాడు. కళాశాలలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో పాల్గొని విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీన్ మల్లికార్జున్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పరిశీలనకు ప్రత్యేక కమిటీ

- వసతి గృహాల్లో ఆహారం కలుషితం కాకుండా చర్యలు
- రాపిడ్ రెస్పాన్స్ టీమ్(ఆర్ఆర్‌టీ) ఏర్పాటు



రాపిడ్ రెస్పాన్స్ కమిటీతో సమావేశం నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి(ఫైల్)

మేడ్చల్ ప్రతినిధి, డిసెంబరు 1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల ప్రభుత్వ వసతి గృహాల్లో కలుషిత ఆహారం కారణంగా పలువురు విద్యార్థులు అనారోగ్యాల బారినపడి ఆస్పత్రుల పాలయ్యారు. దీంతో ప్రభుత్వం ప్రభుత్వ వసతి గృహాలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. అధికారులు వసతి గృహాలను సందర్శించడంతో పాటు విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని, విద్యార్థులతో ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేయాలని, వంటగది శుభ్రతలను పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశించడంతో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో జిల్లా అధికారులు వసతి గృహాల బాట పట్టారు. కలెక్టర్ గౌతమ్ ఆదేశాలతో ప్రతీ రోజు అదనపు కలెక్టర్ విజయేందర్ నేతృత్వంలో అధికారులు ప్రభుత్వ వసతి గృహాలను సందర్శిస్తూ చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ గౌతమ్ రాపిడ్ రెస్పాన్స్ టీమ్(ఆర్ఆర్‌టీ) పేరుతో జిల్లాలో కలుషిత ఆహారానికి అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక కమిటీని నియమించారు. అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి నేతృత్వంలో ఈ కమిటీ పనిచేస్తుంది.

మండలానికో ప్రత్యేకాధికారి..

ప్రభుత్వ వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే తాగునీరు, భోజనం నిర్వహణపై పర్యవేక్షణకు జిల్లా స్థాయి కమిటీకి అదనపు కలెక్టర్‌ను చైర్మన్‌గా నియమించగా, మండలాలకు మాత్రం మండలానికో ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టనున్నారు. మండల ప్రత్యేకాధికారులు వసతి గృహాల్లో ఏవైనా సమస్యలున్నట్లు గుర్తిస్తే వెంటనే జిల్లాస్థాయి కమిటీకి సమాచారం అందిస్తారు. సమస్యకు సంబంధించిన జిల్లా కమిటీలోని సదరు అధికారి తనిఖీలు చేపడతారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అందించే భోజన పదార్థాల నాణ్యతను పరిశీలించేందుకు ఆహార భద్రతా అధికారులతో మరో కమిటీని ఏర్పాటు చేశారు.

జిల్లా కమిటీలో అన్నిశాఖల అధికారులకు బాధ్యతలు

జిల్లా కమిటీలో వసతి గృహాలకు సంబంధమున్న అన్ని శాఖల అధికారులకు బాధ్యతలు అప్పగించారు. చైర్మన్‌గా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, సభ్యులుగా డీఎంహెచ్‌వో రఘునాథస్వామి, ఫుడ్‌సేఫ్టీ ఆఫీసర్ జగన్నాథం, జిల్లా ఆస్పత్రి సభ్యురాలు సునీత, డీఈవో విజయకుమారి, గురుకుల్ పాఠశాలల కమిషనర్ రజనీకాంత్, గిరిజన సంక్షేమాధికారి వినోద్, ఫుడ్ సేఫ్టీ అధికారి మల్లీశ్వరీలు రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లో పనిచేయనున్నారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతిగృహాల్లో కలుషితమైన ఆహారానికి అడ్డుకట్టవేసేందుకు ఈకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక వ్యూహాలను రూపొందించి ఆచరణలో పెట్టనున్నారు.

ఆహారం కలుషితం కాకుండా చర్యలు



జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఆహార విషపూరిత ఘటనలను సమర్థవంతంగా నివారించేందుకు కలెక్టర్ గౌతమ్ ఆదేశాల మేరకు రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు. మండలానికో ప్రత్యేకాధికారి ద్వారా సమాచారం తెలుసుకుని కమిటీ రంగంలోకి దిగుతుంది. కమిటీలోని అధికారులందరూ సమన్వయంతో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో ఎలాంటి సంఘటనలు జరుగకుండా సమర్థవంతంగా చర్యలు తీసుకుంటారు. **- విజయేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్**

పాఠశాల పక్కనే మురుగు

- ఉపాధ్యాయులు, విద్యార్థులకు అసౌకర్యం
- దుర్గంధంతో సతమతం
- ఈగలు, దోమలు, పందులతో పరేషాన్
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ధారూరు: స్టేషన్ ధారూరు ప్రాథమికోన్నత పాఠశాల


ధారూరు: పాఠశాల పక్కనే పేరుకుపోయిన మురుగు

ధారూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పాఠశాలల్లో సరైన సౌకర్యాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాఠశాల భవనం పక్కనే మురుగునీరు నిలిచి ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామంలోని ఇళ్లనుంచి వదిలే మురికినీరు పేరుకుపోయి దుర్గంధం వెలువడుతోంది. స్టేషన్ ధారూరు ప్రాథమికోన్నత పాఠశాల భవనం వద్ద ఈ పరిస్థితి నెలకొంది. గ్రామంలోని ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు పాఠశాల భవనం పక్కనే నిలిచి మురుగు గుంతగా మారింది. మురుగునీరు పారే ప్రాంతం రైల్వే శాఖది కావటం, ముందు వైపు పట్టాభూమి ఉండటంతో మురుగు కాల్వ నిర్మించడం సాధ్యం కావడంలేదని అధికారులు చెబుతున్నారు. ఫలితంగా ఈ మురుగు గుంతల్లో పందులు, కుక్కలు స్వైరవిహారం చేస్తుండటంతో పాఠశాల వెనుకభాగం అపరిశుభ్రంగా మారింది. దీంతో విద్యార్థుల చదువుకు ఆటంకం కలుగుతోంది.

దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నాం



పాఠశాల భవనం పక్కన మురుగు గుంత నుంచి వస్తున్న దుర్వాసనతో ఉపాధ్యాయులు, విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. గ్రామంలోని ఇళ్ల నుంచి వస్తున్న మురుగునీరు ఇక్కడ నిలిచి మురుగు గుంతగా మారింది. ఈ స్థలం రైల్వేశాఖది కావటం, ముందువైపు పట్టాభూమి ఉండటంతో మురుగు కాల్వ నిర్మించేందుకు అభ్యంతరం చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మల్లికార్జున్, హెచ్ఎం, స్టేషన్ ధారూరు ప్రాథమికోన్నత పాఠశాల

తాండూరులో బాలికల హాస్టళ్ల ఎదుట..

తాండూరు: మున్సిపాలిటీలోని భవాని నగర్‌లో ఉన్న బీసీ బాలికల హాస్టళ్ల ఎదుట మురుగునీటితో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మురుగు కాల్వ నిండి వారం రోజులవుతున్నా పట్టించుకోవడంలేదని స్థానికులు అంటున్నారు. మున్సిపాలిటీ అధికార యంత్రాగం దృష్టికి కాలనీవాసులు తీసుకెళ్లారు. అయినా ప్రయోజనం లేకుండా పోయిందని చెబుతున్నారు. తాండూరు పట్టణం స్నేహ సూపర్ మార్కెట్ ముందున్న మురుగు కాల్వ నిండింది. ఈ మురుగు కాల్వ ప్రధానరోడ్డు ఇందిరాచౌక్ నుంచి బస్టాండ్ వరకు వెళ్లే మార్గం. అంతేకాకుండా ఇక్కడున్న షాపింగ్ కాంప్లెక్స్‌లో ఎల్ఐసీ ఆఫీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, సూపర్‌మార్కెట్, జనరల్‌స్టోర్స్ డ్రెస్సెస్ షాపులు ఉన్నాయి. మురుగుకాల్వల నిండి పొంగిపొర్లడంతో దుర్వాసన వస్తుండడంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా మురుగు కాల్వను వెంటనే శుభ్రం చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.


తాండూరు: భవానీ నగర్ బాలికల హాస్టల్ ఎదుట నిండిన మురుగు కాల్వ

న్యూస్ కార్నర్

బీఆర్ఎస్ నాయకుల ముందస్తు అరెస్టు


చెన్‌గోముల్ పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్ నాయకులు

పూడూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గురుకుల పాఠశాలను సందర్శించేందుకు వెళుతున్న బీఆర్ఎస్ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. మండలానికి చెందిన బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి జంగయ్య, పూడూరు గ్రామ కమిటీ అధ్యక్షుడు రాంచంద్రయ్యలు కస్తూర్బా గురుకుల పాఠశాలను సందర్శించేందుకు సోమవారం బయల్దేదారు. సమాచారం అందుకున్న పోలీసులు వారిని ముందస్తు అరెస్టు చేసి చెన్‌గోముల్ పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కొనసాగుతున్న కులగణన ఆన్‌లైన్ నమోదు


వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్న సిబ్బంది

కులకచర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే ఆన్‌లైన్ నమోదు వేగవంతంగా కొనసాగుతోంది. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సర్వేలో సేకరించిన కుటుంబాల వివరాలను సిబ్బంది ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నట్లు ఎంపీడీవో రామకృష్ణ తెలిపారు. ఇప్పటి వరకు 2500 కుటుంబాల వివరాలను ఎంట్రీ చేశామని తెలిపారు. కులకచర్ల మండలంలోని 15095 కుటుంబాలకు గాను 5150 కుటుంబాల వివరాలను నమోదు చేశామని తెలిపారు.

బషీరాబాద్ మండలంలో 53.7 శాతం పూర్తి

బషీరాబాద్: మండలంలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, ఉపాధి కులగణణకు సంబంధిన డాటా నమోదు ప్రక్రియ చకచకా కొనసాగుతోంది. ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఆన్‌లైన్ నమోదును బషీరాబాద్ తహసీల్దార్ వై.వెంకటేష్, ఎంపీడీవో విజయ్‌కుమార్‌ సంయుక్తంగా పరిశీలించారు. ఆపరేటర్లకు పలు సూచనలు చేవారు. మండల వ్యాప్తంగా 53.7శాతం నమోదు పూర్తయింది. ఇంకా 46.3 శాతం సర్వే నమోదు వేగవంతానికి తగిన చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు.వారం రోజుల్లో వందశాతం పూర్తి చేయిస్తామన్నారు.

వేల్పుల రవికుమార్‌కు డాక్టరేట్


డాక్టరేట్‌ను అందుకుంటున్న రవికుమార్

ఘట్‌కేసర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్‌కు చెందిన మినర్వా గ్రామర్ హైస్కూల్ వ్యవస్థాపకులు వేల్పుల రవికుమార్‌కు డాక్టరేట్ లభించింది. విద్యాలయాన్ని నెలకొల్పి పేద, మధ్యతరగతి విద్యార్థులను తక్కువ ఫీజుతో విద్యనందించడంతోపాటు అనాథలకు, ఉచిత విద్యనందిస్తున్నందున విద్యారంగంలో 25ఏళ్లుగా సేవలందిస్తున్నందుకు స్టాన్‌ఫోర్డ్ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నుంచి గతనెల 30న నోయిడాలోని లెమన్‌ట్రీ సాండల్ సూట్స్‌లో జరిగిన కాన్వొకేషన్ వేడుకల్లో డాక్టరేట్‌తో పాటు ఎడ్యుకేషన్ అవార్డును అందజేసినట్లు ఆయన తెలిపారు. ఈసందర్భంగా రవికుమార్‌ను స్థానికులు, విద్యార్థులు, తల్లిదండ్రులు అభినందించారు.

బాల్య వివాహాల నిర్మూలన ప్రతీఒక్కరి బాధ్యత


విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంఈవో హబీబ్ అహ్మద్

కులకచర్ల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలన ప్రతీ ఒక్కరి బాధ్యత అని ఎంఈవో హబీబ్ అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక కేజీబీవీలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. అమ్మాయికి 18, అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాత పెళ్లి చేయాలని తెలిపారు. చిన్న వయసులో పెళ్లిచేస్తే రెండు కుటుంబాలపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవి, చైల్డ్ లైన్ సిబ్బంది పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

బొంరాస్‌పేట్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్తూర్ గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను సోమవారం కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. మధ్యాహ్నభోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో భోజనం నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం మెస్ చార్జీలు పెంచడంతో విద్యార్థులకు మెనూప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని వంట ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. అనంతరం పాఠశాల విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తూర్ మాజీ సర్పంచ్ భీమ్‌రావు, ప్రవీణ్, మాజీ ఎంపీటీసీ భీమ్‌రెడ్డి, యువజన సంఘాల అధ్యక్షులు బాల్‌రాజ్, చందు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ శిరీష పాల్గొన్నారు.

వైభవంగా అయ్యప్ప పడిపూజ


హనుమాన్ దేవాలయంలో పడిపూజ కార్యక్రమం

వికారాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వికారాబాద్ పట్టణంలోని అయ్యప్ప దేవాలయంలో అయ్యప్ప మహపడి పూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.వికారాబాద్ పట్టణానికి చెందిన నారేకల్ 18వ స్వామి నాగరాజు నిర్వహించిన అయ్యప్ప పడి పూజలో అయ్యప్ప స్వాములు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రవి పంతులు ఆధ్వర్యంలో నిర్వహించిన పాటలకు స్వాములు పేట తుల్లి ఆడారు. ఈ స్వామి వారికి అభిషేకం, పడి నిర్వహించగా స్వాములు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పనుల జాతర!

(7వ పేజీ తరువాయి)

పనులతో రూ.29 కోట్ల నిధులు ఖర్చు చేసి కూలీలకు జీవనోపాధి కల్పించాలన్నది లక్ష్యంగా నిర్దేశించారు.

లక్ష్యంలో 97.99 శాతం పూర్తి

ఈ ఆర్థిక సంవత్సరంలో జిల్లాలో కూలీలకు 59,85,161 రోజుల పనులు కల్పించాలని లక్ష్యం నిర్దేశించగా, ఇప్పటి వరకు 58,64,841 రోజుల పాటు పనులు కల్పించారు. జిల్లాకు కేటాయించిన పనుల్లో ఇంత వరకు 97.99 శాతం మేర లక్ష్యం చేరుకోలిగారు. కల్పించిన పనులతో కూలీలకు రూ.139.69 కోట్లు వేతనం (కూలీ)గా ఖర్చు చేయగా, రూ.26.14 కోట్లు మెటీరియల్ కాంపోనెంట్ కింద ఖర్చు చేశారు. ఇంత వరకు జిల్లాలో 3278 కుటుంబాలు వంద రోజుల పని దినాలు పూర్తి చేసుకున్నాయి. జిల్లాలో 1,85,990 జాబ్ కార్డులు ఉండగా, వాటిలో 3,77,582 మంది కూలీలు నమోదై ఉన్నారు. 1,31,422 జాబ్ కార్డులకు సంబంధించి 2,44,420 మంది కూలీలు ఉపాధి పనుల్లో చురుకుగా పాల్గొంటున్నారు. ఉపాధి పనులతో 1,04,895 కుటుంబాలకు ఉపాధి కలుగుతోందని, ఇప్పటి వరకు ఒక్కో కుటుంబానికి సగటున 55.91 శాతం పనిరోజులు కల్పించినట్లు అధికారులు చెబుతున్నారు.

సమస్యలను వెంటనే పరిష్కరించాలి

(7వ పేజీ తరువాయి)

ఎలాంటి లోపం లేకుండా చూసుకోవాలన్నారు సీఎం కప్ క్రీడలను డిసెంబర్ 7 నుంచి 21వ తేదీ వరకు చేపడుతున్నందున ముందుస్తు ఏర్పాట్లు చేపట్టాలన్నారు. డిసెంబర్ 7వ తేదీనుండి 8వ తేదీ వరకు గ్రామ పంచాయతీ స్థాయిలో క్రీడలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు లింగ్యానాయక్, సుధీర్, ట్రైనీ కలెక్టర్ ఉమాహారతి, ఆర్డీవో వాసుచంద్ర, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో స్కాలర్‌షిప్‌లు అందించాలి

విద్యార్థులకు సకాలంలో స్కాలర్ షిప్ అందించేందుకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో విద్యార్థులకు అందించే పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లపై ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ శాఖల అధికారులు, కళాశాలల ప్రిన్సిపల్స్, యాజమాన్యాలతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ పోస్టు మెట్రిక్ స్కాలర్ షిప్‌కు దరఖాస్తు చేసుకునే క్రమంలో వస్తున్న సమస్యలను అధిగమించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పదో తరగతి సర్టిఫికెట్‌లో ఉన్న వివరాలకు ఆధార్ కార్డులో ఉండే విధంగా తప్పులను సరిచేసుకునేందుకు వీలుగా ఆధార్ కిట్లను సమకూర్చుకోవాలన్నారు. నూతన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ-పాస్ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి మల్లేశం, డీటీడీవో కమలాకర్ రెడ్డి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి శంకర్ నాయక్, సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తాం


తాండూరు రూరల్: ఓగీపూర్‌లో నిర్వహించిన మురుగునీటి కాల్వను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

తాండూరు రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా మండలంలోని ఓగీపూర్, కరన్‌కోట్, చంద్రవంచ, చిట్టిఘనాపూర్, బెల్కటూర్, చెంగోల్, చింతామణిపట్నం, పర్వతాపూర్, చెనిగేష్‌పూర్, కొణాపూర్, ఎల్మకన్నె, వీర్‌శెట్టిపల్లి, గోనూరు, నారాయణపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా 27 పనులకు గాను రూ.3కోట్ల 22లక్షలతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తాండూరు నియోజకవర్గంలో రాక్షస పాలన అంతమైందని, ప్రజాపాలన ఆరంభమైందన్నారు. కరన్‌కోట్‌లో ఆరు ఎకరాల ప్రభుత్వ భూమిని త్వరలోనే పేదలకు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌గౌడ్, బాల్‌రెడ్డి, ఉత్తంచంద్, శరణబసప్ప, నాగప్ప, రాజ్‌కుమార్, శివకుమార్, జర్నప్ప, అనిల్, సుధాకర్, హర్షవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, రాజేందర్‌రెడ్డి, నారాయణరెడ్డి, జి.రాందాస్, జగదీశ్వర్ పాల్గొన్నారు.

కరన్‌కోట్ పాఠశాల సందర్శన

తాండూరు మండలంలోని కరన్‌కోట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు తరగతి గదుల ప్రారంభోత్సవం అనంతరం పదో తరగతి ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థుల తరగతికి వెళ్లి విద్యార్థులతో ఎమ్మెల్యే మాట్లాడారు. అనంతరం వంట గదిలోకి వెళ్లి మధ్యాహ్న భోజనం అన్నం, కూరగాయలను పరిశీలించారు. నాసిరకంగా వండితే ఏజెన్సీ రద్దు చేస్తామని ఎమ్మెల్యే హెచ్చరించారు. కాగా, కరన్‌కోట్, బెల్కటూర్, ఓగీపూర్, గౌతాపూర్ గ్రామాల్లో కొంత మంది మహిళలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో మాట్లాడి తగు చర్యలు తీసుకోవాలన్నారు.

తాండూరు: ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా సోమవారం రెండవ రోజు తాండూరు మున్సిపాలిటీలో చైర్‌పర్సన్ స్వప్న మురుగు కాల్వలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. మున్సిపాలిటీ పరిధిలో 20, 25, 27వార్డుల్లో ఈ కార్యక్రమాలను నిర్వహించారు. మురుగు కాల్వలను శుభ్రంచేసి బ్లీచింగ్ చల్లించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ విక్రం సింహా రెడ్డి, కౌన్సిలర్లు ప్రభాకర్ గౌడ్, సంగీత ఠాకూర్, మేనేజర్ నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బషీరాబాద్: బషీరాబాద్-తాండూరు ప్రధాన మార్గంలో బీటీ రోడ్డు మరమ్మతు పనులకు ఏట్టకేలకు మోక్షం లభించింది. ఎన్కెపల్లి, అగ్గనూర్ సమీపంలో బీటీ రోడ్డు మరమ్మతు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ మార్గంలో సుమారు రెండు కిలోమీటర్ల మేరబీటీ రోడ్డు పాడై అధ్వాన్నంగా మారగా అప్పట్లో కాంట్రాక్టర్ పెకిలించి కంకరవేసి వదిలేశారు. ఇంతకాలం వాహనదారులు ఇక్కడి రోడ్డుపై వెలువడే దుమ్ముతో నానా అవస్థలు పడేవారు.

బొంరాస్‌పేట్: ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో భాగంగా బొంరాస్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. లాంగ్‌జంప్, షాట్‌పుట్, స్కిప్పింగ్, మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ఉపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గోపాల్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యేల పర్యటన

బషీరాబాద్/కులకచర్ల: బషీరాబాద్ మండలంలో : ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి (నేడు) మంగళవారం పర్యటించనున్నట్లు ఆపార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలానికి ఈజీఎస్ పథకం కింద 2.75 కోట్ల నిధులు మంజూరు కాగా, ప్రజాపాలన విజయోత్సవ కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామాల్లో వివిధ పనులకు శంకుస్థాపనలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా కులకచర్ల మండలంలో పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి మంగళవారం పర్యటించనున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీఎస్.ఆంజనేయులు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కార్యక్రమానికి సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మేడ్చల్ టౌన్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని మేడ్చల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మర్రి దీపిక నర్సింహారెడ్డి అన్నారు. ప్రజాపాలనతో భాగంగా సోమవారం మున్సిపల్ పరిధిలోని 18వ వార్డులో వీధులను శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, కౌన్సిలర్ భవాని రాఘవేందర్ గౌడ్, నాయకులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ రూరల్: పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావనిజంగయ్యయాదవ్ తెలిపారు. ప్రజాపాలన సందర్భంగా ఎదులాబాద్‌లో ఆమె సోమవారం వీధులను శుభ్రం చేశారు. వోల్టేజ్ సమస్యతో 50 వీధిలైట్లు దగ్ధంకాగా వాటి స్థానంలో 25లైట్లు అమర్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముల్లి జంగయ్యయాదవ్, కందుల కుమార్, సామల అమర్, మెట్టు నర్సింహా, సత్తయ్య, బింగి రాజేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

ఒక్క కార్మికుడితో పనులు ఎలా?



అధికారులను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్ సంగీత ఠాకూర్

తాండూరు: ప్రజాపాలన విజయోత్సవాల్లో పరిసరాలు శుభ్రం చేసే కార్యక్రమం చేపట్టడం బాగానే ఉన్నా కేవలం ఒక్క కార్మికుడు ఉంటే ఎలా? అని కౌన్సిలర్ సంగీత ఠాకూర్ ప్రశ్నించారు. తన వార్డులో సోమవారం జరిగిన ప్రజాపాలన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. అయితే, మురుగు కాల్వలు శుభ్రం చేయడానికి కార్మికులు అవసరం కాగా కేవలం ఒక్క కార్మికుడు ఉండటంతో ఎదేంటని ప్రశ్నించారు. ఫొటోలకు ఫోజులిచ్చి మేము వెళ్లడమేనా? అంటూ మండిపడ్డారు. కార్మికులను ప్రత్యేకంగా నియమించాలని డిమాండ్ చేశారు. కమిషనర్ పాలకుల వినతిని పట్టించుకోవడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఆఫీసర్ రాములు ఉన్నారు.

అన్నదాతల్లో కలవరం


పొలంలో వరికోసి ధాన్యం పోస్తున్న హార్వెస్టర్

బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రెండు, మూడు రోజుల నుంచి మబ్బులతో కూడిన వాతావరణం నెలకొనడంతో రైతులు గుబులు చెందుతున్నారు. మండలంలో ఇప్పటికే వరి కోతలు జోరందుకున్నాయి. రోజంతా ఆకాశంలో మబ్బులు కమ్ముకోవడంతో వర్షం ఎక్కడ కురుస్తుందోనని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వర్షం పడితే వరిధాన్యం పొలాల్లోనే రాలిపోతుందని, హార్వెస్టర్లతో చకచకా వరి కోత పనులు పూర్తి చేస్తున్నారు. ఇప్పటికే కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చిన ధాన్యం తడవకుండా ఉండేందుకు టార్పాలిన్లు కప్పుతున్నారు.

విద్యార్థులకు ఐడీ కార్డులు పంపిణీ


విద్యార్థులకు ఐడీ కార్డులు అందిస్తున్న చందు

దోమ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జీహెచ్ఎం అమర్‌నాథ్ ఆధ్వర్యంలో సోమవారం 408మంది విద్యార్థులు ఐడీ కార్డులు, టై, బెల్టులు, స్పోర్ట్ దుస్తులను గ్రామానికి చెందిన పూర్వ విద్యార్థి గొల్ల చందు అందజేశారు. ఈ సందర్భంగా చందును పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు కృష్ణ, వెంకటయ్య, బిచ్చన్న, గ్రామస్థులు బాలయ్య, గఫార్, మొహ్మద్, ఎల్లయ్య, చెన్నయ్య, గురుచరణ్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీలో అధికారుల నిర్లక్ష్యం

శామీర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం రుణమాఫీ ప్రకటించి ఆరునెలలు గడిచినా తనకు రుణమాఫీ చేయడంలో సంబంధిత రైతు సహకార సంఘం, బ్యాంకు అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని అలియాబాద్ గ్రామానికి చెందిన బాధిత రైతు, మాజీ ఎంపీపీ పల్లె సీతారాములుగౌడ్ తెలిపారు. ఆయన సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. తనకు శామీర్‌పేట మండలం తుర్కపల్లి గ్రామ పరిధిలో వ్యవసాయ భూమి ఉందని, అట్టి భూమిలో వ్యవసాయ పంటల సాగుకు తాను మేడ్చల్ మండలం పూడూరు రైతు సహకార సంఘంలో రూ.90,824ల క్రాప్‌లోన్ తీసుకున్నట్లు తెలిపారు. ఆరు నెలలుగా తాను సంబంధిత పూడూరు రైతు సహకార సంఘం, ఎస్‌బీఐ మేడ్చల్ బ్రాంచ్ చుట్టూ తిరిగినా అధికారులు మాత్రం తనకు రుణమాఫీ నిధులు రాలేదని, ఆడిట్ చేయలేదని నిర్లక్ష్యంగా సమాధానమిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రుణమాఫీ చేసినట్లు ప్రభుత్వం ప్రకటించి ఆరు నెలలు అవుతున్నా తన రుణం మాఫీ చేయకపోవడం దారుణమని సీతారాములుగౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. తన సమస్యపై సంబంధిత ప్రభుత్వ ఉన్నతాధికారులు వెంటనే స్పందించి న్యాయం చేయాలని కోరారు.

విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరం



విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేస్తున్న చైర్‌పర్సన్ స్వప్న

తాండూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని తాండూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సాక్ష్యాత్తు మిషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ పొందిన విద్యార్థులకు సోమవారం ఆమె సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఏఎస్ కంప్యూటర్ సాఫ్ట్ స్కిల్స్‌సెంటర్ ఆధ్వర్యంలో 40మంది శిక్షణపొంది పరీక్ష ఉత్తీర్ణులైన విద్యార్థులకు మున్సిపల్ చైర్‌పర్సన్ స్వప్న చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ స్వప్న మాట్లాడుతూ.. ప్రతీఒక్కరికి రాబోయే తరానికి కంప్యూటర్ నైపుణ్యం ప్రత్యేకంగా అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అన్నపూర్ణ, డాక్టర్ పద్మనాభ రెడ్డి పాల్గొన్నారు.

మసీదు భూమిని 'ధరణి'లో నమోదు చేయాలి

బషీరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): బషీరాబాద్ మసీదుకు చెందిన ఆరు ఎకరాల భూమి వివరాలను ధరణి పోర్టల్‌లో ఎక్కించాలని స్థానిక ముస్లిం వెల్ఫేర్ కమిటీ సభ్యులు సోమవారం బషీరాబాద్ ప్రజావాణిలో వినతి పత్రం అందజేశారు. ఇందర్‌చెడ్ మార్గం పక్కన గల మసీదు భూమి అక్బర్‌సాబ్ పేరిట ఉందని, ఆపేరును కమిటీ పేరుమీద మర్చాలని వారిచ్చిన పత్రంలో కోరారు. ఇందుకు తహసీల్దార్ స్పందిస్తూ తగిన చర్యలు తీసుకుంటామని వారికి తెలిపారు.ఈ కార్యక్రమంలో పకీర్ అహ్మద్, మహ్మద్, రాజాక్, ఇబ్రహీం, మక్బూల్, మోసిన్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కమిటీ సభ్యులు

ఈనెల 10న భగవద్గీత కంఠస్థ పోటీలు


వికారాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మప్రచార పరిషత్ హైదరాబాద్ ఆధ్వర్యంలో గీతా జయంతిని పురస్కరించుకుని డిసెంబరు 10వ తేదీన వికారాబాద్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు పగడాల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 6, 7, 8, 9 తరగతుల విద్యార్థులు ఆరవ అధ్యాయంలో 15శ్లోకాలు నేర్చుకొని వేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించనున్న ఈ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

మర్రి చెన్నారెడ్డికి ఘన నివాళి


మరిచెన్నారెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

వికారాబాద్, డిసెంబర్ 2 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి మర్రిచెన్నారెడ్డి వర్ధంతిని పురస్కరించుకుని వికారాబాద్‌లోని ఎన్నెపల్లిలో గల ఆయన విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ మంజుల రమేష్ ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, నాయకులు దీపు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి అధిక నిధులు


అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

కీసర రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులకు అధిక నిధులు కేటాయించనున్నట్లు నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. సోమవారం నాగారం మున్సిపాలిటీ మూడో వార్డులోని శ్రీరామలింగేశ్వర కాలనీలో రూ.15లక్షలతో చేపట్టనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేసారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, స్థానిక కౌన్సిలర్ గోక కళావతి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

4వ విడత రుణమాఫీని వినియోగించుకోవాలి

దోమ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ప్రతీ రైతు ప్రభుత్వం అమలు చేస్తున్న 4వ విడత రుణమాఫీని రైతులు వినియోగించుకోవాలని ఏవో ప్రభాకర్‌రావు సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. రూ.2లక్షలకు పైగా రుణాలు ఉన్న రైతులు బ్యాంకుల్లో అందుకు సంబంధించిన పత్రాలను సమర్పించాలని తెలిపారు.